మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ /వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



## ఆయకట్టుకు కొనసాగుతున్న 5వ విడత కోయిల్‌సాగర్ నీటిసరఫరా..

**-18.8 ఫీట్లకు తగ్గిన కోయిల్‌సాగర్ నీటిమట్టం**

**దేవరకద్ర,మార్చి 17 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్ నుండి ఆయకట్టుకు కుడి,ఎడమ కాలువల ద్వారా నీటిసరఫరా ప్రారంభమైంది. గత మూడు రోజుల క్రితం ఆయకట్టుకు నీటిసరఫరాను సంబందిత అధికారులు ప్రారంభించారు. ఈ విధంగా ఆయకట్టుకి నీటిని విడుదల చేయడం ఇది 5వ సారి. ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తుండటంతో ప్రాజెక్టులో నీటిమట్టం 18.8 ఫీట్లకు తగ్గింది. ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తుండటంతో ప్రాజెక్టులో క్రమేపి నీటిమట్టం తగ్గుతూ వస్తుంది.ఆయకట్టుకు నీటిసరఫరాను సంబందిత అధికారులు విడుతల వారిగా కొనసాగిస్తున్నారు. అయితే ఆయకట్టుకు నీటిసరఫరా చేస్తుండటంతో ప్రాజెక్టు పరిదిలోని దేవరకద్ర,మరికల్,ధన్వాడ మండలాలకు చెందిన ఆయకట్టు రైతులు ముమ్మరంగా పంటలను పండించుకొంటున్నారు.



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

## కంటి వెలుగు కార్యక్రమంతో పేద ప్రజల కళ్లలో ఆనందం చూస్తున్న..

**జిల్లా ఇంచార్జీ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్**

**వనపర్తి ప్రతినిధి,మార్చి 17 ప్రభాతవార్త:** కంటి వెలుగు కార్యక్రమం పేద ప్రజల కళ్లలో ఆనందం చూస్తున్నానని జిల్లా ఇంచార్జీ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని 22వ వార్డులో కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిఖంగా తనిఖీ చేశారు. 18ఏళ్లు పై బడిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు నిర్వహించుకొని వారికి అవసరమైన అద్దాలు పొందవచ్చునని తెలిపారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా నిర్మించే భవనాలు పనులు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పౌష్టికాహారం పంపిణీ తదితర వివరాలు అంగన్వాడీ టీచర్ ద్వారా తెలుసుకున్నారు. ఆయన వెంట ఎ౦.సాయినాథ్ రెడ్డి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న ఇంచార్జీ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్

## ప్రశ్న పత్రాలను పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ సమక్షంలోనే ఓపెన్ చేయాలి...

**నాగర్‌కర్నూల్‌జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,మార్చి 17 ప్రభాతవార్త:**ఇంటర్మీడియట్ పరీక్ష ప్రశ్నపత్రాలను నిర్ధేశించిన సమయానికే తెరువాలని, ప్రశ్న పత్రాలను తెరిసే సందర్భంలో సీల్ తీసేటప్పుడు తప్పనిసరిగా చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు తప్పనిసరిగా హజరై సీసీ కెమెరాల సమక్షంలోనే ఓపెన్ చేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. ప్రశ్నపత్రాల బహిర్గత చేయడం మరియు సూచిరాతకు ఆస్కారం లేకుండా పరీక్షలను పకడ్బందిగా నిర్వహించాలని ఆదేశించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని శ్రీనివాస పద్మావతి జూనియర్ కళాశాల, బిజినపల్లి మండలం పాలెం శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అకస్మికంగా తనిఖీ చేశారు. నిఘా నేత్రాల ఏర్పాటు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 31 పరీక్ష కేంద్రాల్లో నేటి ఇంటర్ మొదటి సంవత్సరం ఆంగ్ల పరీక్షలకు 6161 మంది విద్యార్థులకు గాను 5804 మంది విద్యార్థులు హజరు కాగా 357 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో డిఐవీఓ వెంకటరమణ, డీపీఆర్ఓ సీతరాం, హైదరాబాద్ ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు విశ్వేశ్వర్, సాగర్, షరీఫ్, ఫ్లయింగ్ సా క్వడ్స్ ప్రభాకర్‌వర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ ఆనంద్‌గౌడ్, అనసూయ తదితరులు ఉన్నారు.



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం...

**-విగ్రహావిష్కరణలో ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

**వెల్దండ, మార్చి 17 ప్రభాతవార్త:**అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీ చైర్ పర్సన్ శాంతకుమారిలు అన్నారు. వెల్దండ మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి గ్రామంలో బాబాసాహెబ్ అంబేద్కర్ నూతన విగ్రహాన్ని శుక్రవారం ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీ చైర్మన్ శాంతకుమారిలు ఆవిష్కరించారు. సర్పంచ్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నవభారత రాజ్యాంగ నిర్మాత, దళిత జీవిత బాంధవుడు, సమిష్టి సాధనతో సాధించుకున్న స్వాతంత్ర్య భారతదేశాన్ని సరైన సుపరిపాలన జరుపుకునే దేశంగా రూపొందించడానికి తన జీవితాన్ని దార పోసిన బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబా సాహేబ్ అంబేద్కర్ అని వారు కొనియాడారు. డాక్టర్ భీంరావ్ రాంజీ అంబేద్కర్ ఒక ప్రముఖ భారతీయ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత్త, సంఘ సంస్కర్త, స్వతంత్ర్య భారత దేశానికి రాజ్యాంగం ద్వారా దిశ, నిర్ధేశం చేసిన రాజ్యాంగ శిల్పి, గొప్ప మేధావి అన్నారు. అణగారిన వర్గాలకు, అంటరాని తనానికి, కుల వ్యవస్థ నిర్మూలన కోసం కృషి చేసిన వ్యక్తి అని, సమాజంలో ఉన్న ప్రతి వ్యక్తి తన హక్కుల సాధన కోసం పోరాడే అవకాశం కల్పించిన మహాత్ముడని పేర్కొన్నారు. ఆశయాలు ఆచరణలో పెడితే మానవుడే మహానీయుడవుతాడు అని బలంగా నమ్మి నేడు దేశ వ్యాప్తంగా నీరాజనాలు అందుకుంటున్న మరుపులేని మహానీయుడు అంబేద ్కర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోళి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ విజితారెడ్డి, ఎంపీపీ విజయ జైపాల్‌నాయక్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు శివ, హరికిషన్, రాజు, రామస్వామి, ఉప సర్పంచ్ చిన్న నాయక్, హరికిషన్‌నాయక్, శేఖర్, రాంచందర్, పోలే రాజు, రాములుతో పాటు తదితరులు ఉన్నారు.



అంబేద్కర్ విగ్రహావిష్కరణలో గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్, శాంతకుమారి, పలువురు నాయకులు

## ఎన్నికల దృష్ట్యా .. చెక్‌పోస్టులను పటిష్టం చేయాలి

**నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**నారాయణపేట ప్రతినిధి,మార్చి 17 ప్రభాతవార్త :** రాబోయే కర్ణాటక శాసనసభ సాధారణ ఎన్నికలు 2023ను దృష్టిలో పెట్టుకుని సరిహద్దు చెక్ పోస్టులను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందని నారాయణపేట జిల్లా కలెక్టర్ శ్రీ కోయ హర్ష అన్నారు. శుక్రవారం ఉదయం గూగుల్ మెట్‌ద్వారా కర్ణాటకలోని యాద్గిర్ జిల్లా, నారాయణపేట జిల్లా కలెక్టర్, ఎస్పీల ఇంటర్ స్టేట్ బోర్డర్ సమావేశం నిర్వహించగా విడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్, ఎస్పీ పాల్గొన్నారు. యాద్గిర్ జిల్లా నుండి జిల్లా కలెక్టర్ ఆర్. స్నేహ, జిల్లా ఎస్పీ సిబి వేదమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల మధ్య చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి జిల్లాల పరిసరాలలో జరిగే మద్యం అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల గురించి, ఇంటర్ స్టేట్ గ్యాంగ్స్ దొంగతనాల గురించి , అక్రమంగా గుట్కా రవాణా, పిడిఎస్ రైస్, – మిగతా4లో..



విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న యాద్గిర్ జిల్లా కలెక్టర్ ఆర్.స్నేహ



కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీ

## మహానగరంగా... మహబూబ్‌నగర్..!




- నాడు గుంతల రోడ్డు.. నేడు నాలుగు లేన్ల రహదారి
- పట్టణంలో జంక్షన్ల అభివృద్ధి, సుందరీకదరణ
- అద్భుత పర్యాటక కేంద్రంగా శిల్పారామం,ట్యాంక్‌బండ్
- ప్రత్యేక ఆకర్షనగా నిలువనున్న తీగల వంతెన, ఐలాండ్
- పర్యాటక, ఐటీ హబ్‌గా మారనున్న పాలమూరు

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 17, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ అనగానే పట్టణానికి వెళ్లడానికి దారంతా గతుకుల రోడ్డు, అప్పన్నపల్లి బ్రిడ్జి కష్టాలు, పట్టణంలో తాగునీటికి తిప్పలు, ఎండాకాలంలో ఎక్కడైన కనీసం సేదతీరుదామంటే చెట్టు,ఒక పార్కు కూడా లేని పరిస్థితి ఉండేది. దవాఖానలో వసతులు, సరైన వైద్యం అందక ప్రాణం పోయిన రోజులు ఎన్నో ఉన్నాయి.. కానీ స్వరాష్ట్రంలో పరిస్థితులు పూర్తిగా మారాయి. మయూరీ పార్క్ నుంచి విశాలమైన నాలుగు లేన్ల రహదారి.. షూటింగ్‌లు చేసుకునేలా రూపుదిద్దుకున్న కేసీఆర్ ఎకో అర్బన్ పార్క్..దారి పొడవునా మూడు వరుసుల్లో చెట్లు..రోడ్డు మధ్యలోనూ మొక్కలు..ఓ వైపు పూర్తయి, రెండో వైపు తుదిదశలో అప్పన్నపల్లి పై ఓవర్ బ్రిడ్జి, సుందరీకరణతో జంక్షన్లు, పట్టణంలో వార్డుకో పార్కు, హైదరాబాద్‌కు దీటుగా మినీ శిల్పారామం, ట్యాంక్ బండ్ సుందరీకరణ, ఐలాండ్,తీగల వంతెన, నెక్లెస్ రోడ్డు, ఇంటి వద్ద నల్లా తిప్పితే నీళ్లు, సర్కార్ దవాఖానలో మోకీలు మార్పిడి ఆపరేషన్ సైతం చేయించుకునే సౌలత్, నిత్యం విద్యుత్ వెలుగులు,పచ్చదనంలో పైట కప్పుకున్నట్లు పొలాలు, దర్గాగా వీధి తమ షెడ్డులోనే వ్యాపారులు అమ్మకునే సౌకర్యం, అత్యాధునిక కూరగాయల మార్కెట్లు, రైతన్నలు పంటలు నిల్వచేసుకునేందుకు గోదాంలు, సర్వమతాలకు సమప్రాధాన్యం ఇస్తూ ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా ఆలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధి పూర్వ వైభవానికి నోచుకున్నాయి. మహబూబ్‌నగర్ పట్టణానికి స్వల్ప కాలంలోనే అభివృద్ధికి బాటలు పడ్డాయి. తొమ్మిదేండ్లలో కనీవినీ ఎరుగని రీతిలో మార్పులు చోటు చేసుకున్నాయి. విద్యా,వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. దివిటిపల్లి ఐటీ పార్క్ వద్ద రూ.10వేల కోట్లతో లిథియం గిగా సెల్ బ్యాటరీ కంపెనీ ఏర్పాటు కానుండడంతో ప్రత్యక్షంగా 10వేల మందికి ఉద్యోగాలు దొరుకుతాయి. దీంతోపాటు పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

**అభివృద్ధి ఐకాన్ శిల్పారామం..**

గతంలో అటుగా వెళ్లాలంటేనే ముక్కు మూసుకుని వెళ్లే దుస్థితి ఉండేది. పట్టణం చెత్త మొత్తం ఇండ్ల మధ్యనే వేసినా పట్టించుకోలే. చేసేది ఏమీ లేక ముక్కు మూసుకుని వెళ్లేవారు. డంపింగ్ యూర్డు స్థలంలో హైదరాబాద్ తరహాలో మినీ శిల్పారామం నిర్మించారు. రూ.13కోట్లతో 6.80 ఎకరాల్లో ఫ్యామిలీ ఫంక్షన్ హాల్, ఓపెన్ థియోటర్, ఫుడ్ కోర్టు, చిల్డ్రన్ పార్క్‌తో మినీ శిల్పారామం పనులు తుది దశలో ఉన్నాయి.

**మినీ ట్యాంక్ బండ్ అందాలు..**

గతంలో బైక్ పోయేంత చిన్న చెరువుకట్ట రోడ్డు, రోడ్డును కమ్మేసిన చెట్లతో నిండి ఉండేది. చెరువునిండా మురికి కంపు, వర్షం వచ్చిందంటే సరైన తూము లేక కాలనీలకు మురుగునీరు చేరేది. మంత్రి శ్రీనివాస్ గౌడ్ హయాంలో పెద్ద చెరువుకు మహర్దశ చేకూరేలా ప్రయత్నాలు మొదలుపెట్టారు. నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడాలని రూ.145కోట్లతో మినీట్యాంక్‌బండ్‌గా రూపుతీసుకొచ్చారు. ట్యాంక్ బండ్ నుంచి ఐలాండ్ వరకు రూ.14కోట్లతో కేబుల్ బ్రిడ్జి మంజూరుకావడంతో పనులు పురోగతిలో ఉన్నాయి. రూ.15కోట్ల అంచనా వ్యయంతో పెద్దచెరువు – మిగతా4లో..

## వచ్చే ఐదేళ్లలో అలంపూర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి..



ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి

**ఆర్డీఎస్,నెట్టెంపాడు,జూరాల ప్రాజెక్టుల ద్వారా అలంపూర్ రైతులకు సాగునీరు**

**పలుచోట్ల రిజర్వాయర్లు ఏర్పాటు**

**జోగులాంబ ఆలయ అభివృద్ధికి కృషి**

**అలంపూర్‌ప్టణం అభివృద్ధిపై దృష్టి పెడతా**

**జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న నూతన ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి**



జోగులాంబ అమ్మవారి ఆలయ సన్నిధిలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి వారి అనుచరులు

**ఇటిక్యాల, మార్చి 17 ప్రభాతవార్త :** అలంపూర్ నియోజకవర్గంలో చివరి ఆయకట్టు రైతులకు సాగునీరందించేందుకు గాను ఆర్డీఎస్ ప్రాజెక్టు, తుమ్మిళ్ల ఎత్తిపోతలపథకం, నెట్టెంపాడు, జూరాల ప్రాజెక్టు లింక్‌కెనాల్ ద్వారా పలుచోట్ల రిజర్వాయర్లు ఏర్పాటు చేసిన వాటి ద్వారా చివరి ఆయకట్టు రైతులకు సాగునీరందించేందుకు సంబంధిత నీటి శాఖ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తానని అలాగే జోగులాంబ అమ్మవారి ఆలయ అభివృద్ధికి, అలంపూర్ పట్టణంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు, 50పడకల ఆసుపత్రి, రోగులకు బెడ్లు పెంపు, అలాగే అలంపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్ ఆశీస్సులతో తను పని చేస్తానని నూతన ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి వివరించారు. గురువారం ఏకగ్రీవంగా ఎమ్మెల్యేల కోటాకింద ఎమ్మెల్సీగా ఎన్నికైన చల్లా వెంకటరామిరెడ్డి గురువారం రాత్రి ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాక శుక్రవారం హైదరాబాద్ నుండి బయలుదేరి జోగులాంబ గద్వాల బ్రహ్మేహ్వరస్వామి ఆలయానికి చేరుకోగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేల కోటాకింద ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గంలోని 7 మండలాలలో విద్య,వైద్యం, రోడ్ల సౌకర్యం, తాగు,సాగు నీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని అలాగే ఆర్డీఎస్ ప్రాజెక్టు, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా అలంపూర్ వరకు చివరి ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని అందుకే తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం, ఆర్డీఎస్ ప్రాజెక్టు,నెట్టెంపాడు, జూరాల ప్రాజెక్టుల ద్వారా అలంపూర్ నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు రైతులకు సాగునీరందించేందుకు పలుచోట్ల రిజర్వాయర్లు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో సాగునీరందించేందుకు దృష్టి పెడతానని అందుకు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి రైతులకు సాగునీరందించడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. అలాగే అలంపూర్ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అలంపూర్ పట్టణంలో గతంలో ఆటో డ్రైవర్లకు ప్లాట్లు పంపిణీ చేసిన అవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని అలంపూర్‌లో డిగ్రీ కళాశాలల ఏర్పాటు, టెక్నికల్ కళాశాలలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా అలంపూర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం అందరిని కలుపుకుపోయి విభేదాలు లేకుండా చేసి వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే గెలుపుకోసం పూర్తిస్థాయిలో పని చేస్తానని, అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని 4 నియోజకవర్గాలలో తనకున్న ఇమేజ్ వల్ల బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తూ ఎమ్మెల్యేల గెలుపుకోసం తనవంతు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి కెసిఆర్ మంత్రి కెటిఆర్‌లు తనపై నమ్మకముంచి ఎమ్మెల్యేల కోటాకింద ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనకు సహకరించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అయూమ్, మండలాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు రంగారెడ్డి, ఆయా మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గతంలో ఒక్క సీఎంఆర్‌ఎఫ్ చెక్కు రాకుండే..

- నేడు సీఎం సహాయనిధి పొందని పల్లె లేదు..
- ఎవరికీ ఏ ఆపద వచ్చినా అండగా ఉంటా...
- సూపర్ స్పెషాలిటీ వైద్యం స్థానికంగానే అందిస్తాం
- సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మార్చి 17,ప్రభాతవార్త :** గత 40ఏండ్ల కింద నుంచి కూడా సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అంటే ఎవరికీ వచ్చేది కాదు..ఏ సర్కార్ కూడా ఇంత పెద్ద ఎత్తున ఇచ్చేది కాదు..అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ దవాఖానకు వెళ్తే సీఎంసహాయనిధి నుంచి కనీసం సాయం కూడా అందించే పరిస్థితి ఉండేది కాదని ఎక్సైజ్,పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గుర్తుచేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భూత్పూర్ రోడ్డులో మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద 42మందికి రూ.31.05లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుకు ముందు మహబూబ్‌నగర్ అంటే ఎవరూ పట్టించుకునే పరిస్థితి ఉండేది కాదన్నారు. ఏ చిన్న రోగం వచ్చినా హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లేదన్నారు. కానీ నేడు మహబూబ్‌నగర్‌లోనే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో దవాఖానలో ఆక్సిజన్ కూడా ఉండేది కాదని, నేడు మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానలో 500 పకడలకు ఆక్సిజన్ బెడ్ సౌకర్యం ఉందన్నారు. ఆక్సిజన్ ఇక్కడే ఉస్మానియా, గాంధీ, నిమ్స్ తర్వాత మహబూబ్‌నగరలోనే ఆక్సిజన్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు మంత్రి గుర్తు చేశారు.

**క్యాన్సర్, గుండె మార్పిడి చికిత్సలు..**

ప్రస్తుతం రూ.500కోట్లతో పాత కలెక్టరేట్ ఆవరణలో నిర్మిస్తున్న 1000 పడకల సూపర్ స్పెషాలిటీ దవాఖానలో క్యాన్సర్ స్క్రీనింగ్,గుండె మార్పిడి చికిత్స సైతం అందుబాటులోకి రానున్నాయని మంత్రి తెలిపారు. పేదల కోసం నిరతరం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూనే ఉంటామని తెలిపారు. ప్రైవేట్‌లో వైద్యం చేయించుకున్న వారికి కూడా పెద్ద ఎత్తున సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎవరికీ ఏ ఆపద వచ్చినా, ఏ అర్ధరాత్రి అయినా అండా ఉంటామని సాయం అందిస్తామని మంత్రి స్పష్టంచేశారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా హాస్పిటల్ మాజీ సూపరింటెండెంట్ శ్యామ్యూల్‌తో సమైక్య రాష్ట్రంలో వైద్య సేవలు అందక ఇబ్బందులు పడ్డ రోజులు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ రహెమాన్,వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కంపోస్టు ఎరువు తయారీపై దృష్టి సారించాలి...

**గుర్తించిన అన్నిచోట్ల తెలంగాణ గ్రామీణక్రీడా ప్రాంగణాలు గ్రౌండ్ చేయాలి**

**వైకుంఠధామాలలో అంత్యక్రియలు జరిగేలా ప్రజలను చైతన్యం చేయాలి**

**ఎంపిడిఓలను ఆదేశించిన జిల్లా కలెక్టర్ జి. రవినాయక్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మార్చి 17 ప్రభాతవార్త :** ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో కూలీల సంఖ్యను పెంచాలని, తెలంగాణకు హరితహారంలో భాగంగా వేసవిని దృష్టిలో ఉంచుకుని అన్ని నర్సరీలలో నీడనిచ్చే విధంగా నెట్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ఎంపిడిఓలు, ఎంపిఓలతో వివిధ అంశాలపై విడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. దళితబంధు పథకం కింద మొబైల్‌యాప్‌లో వివరాలను 93శాతం అప్‌లోడ్ చేయడం జరిగిందని, –మిగతా4లో..



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ జి.రవినాయక్

## అంధత్వ నివారణకే ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలి: జిల్లా డీపీఓ సురేష్ కుమార్

**అమరచింత,మార్చి 17 ప్రభాతవార్త:** అంధత్వ నివారణ కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేసుకోవాలని జిల్లా డీపీఓ సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం అమరచింత మండల పరిధిలోని ఈర్లదిన్నె గ్రామంలో జరుగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలో ఇప్పటి వరకు 750మందికి పరీక్షలు నిర్వహించామని 85మందికి అద్దాలను పంపిణీ చేస్తామని అలాగే కంటి ఆపరేషన్ అవసరమున్న 41మందిని గుర్తించామని అన్నారు. ప్రతి ఒక్కరు కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అమరచింత మండల ఎంపీడీఓ జ్యోతి పరోసియా, డా.దీపిక, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్ఎమ్ లు హైమావతి, ఉమామహేశ్వరి, డీఈఓ గోపాల్ నాయక్, ఆశవర్కర్లు జయసుధ, లలిత, సుజాత, రాజేశ్వరి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు..

**అమరచింత,మార్చి 17 ప్రభాతవార్త:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం సాధించిన సందర్భంగా శుక్రవారం అమరచింత మండల కేంద్రంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అలాగే అమరచింత పట్టణంలో జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులకు బీజేపీ నాయకులు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎమ్ రాష్ట్ర నాయకులు మేర్వరాజు, బీజేపీ పట్టణ అధ్యక్షులు క్యామ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని, తెలంగాణ రాష్ట్రంలో అధికార పార్టీకి ఉపాధ్యాయులు గుణపాఠం చెప్పారని అన్నారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్యే ఎన్నికల్లో ఏవీఎన్ రెడ్డి కి సహకరించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగన్నాథం, నరసింహ, రాకేష్ కుమార్, శెట్టి, మేర్వ అనిల్, మేర్వ శ్రీను, ఒగ్గు పాండు, సంబరి సత్యనారాయణ, పాల్గొన్నారు.



## సిట్ వద్దు, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి..

**అమరచింత,మార్చి 17 ప్రభాతవార్త:** టీఎస్ పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజీలో సిట్ తో కాకుండా, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం అమరచింత మండలంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిట్ రాష్ట్ర ప్రభుత్వం పంజరంలోకి చిలక అని, వాస్తవాలు బయటికి రాబన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అన్నారు. ఏళ్ల తరబడి ఉద్యోగ భర్తీ చేయకుండా నాంచి, ఎన్నికల ముందు నోటిపికేషన్లు ఇచ్చిందని, మళ్లీ పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, భర్తీ చేతకాదని ఇదేం ప్రభుత్వం అని ప్రశ్నించారు. ప్రశ్నాపత్రాల లీకేజీలో నిందితులను వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యం చెందిన టీఎస్ పీఎస్సీ చైర్మెన్ కార్యదర్శులపై చర్య తీసుకోవాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నిరుద్యోగులకు న్యాయం జరిగేదాక పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



## తూముకుంటలో యువ సంఘటన యాత్ర..

**వీపనగండ్ల,మార్చి 17 ప్రభాతవార్త:** యువ సంఘటన యాత్రలో భాగంగా శుక్రవారం వీపనగండ్ల మండలం తూముకుంట గ్రామంలో బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు కాలేజీ కి వెళ్లడానికి బస్సు సౌకర్యం లేకపోవడం, అంగన్వాడీ భవనాలు లేకపోవడం యువకులకు గ్రంథాలయం లేకపోవడం, కొల్లాపూర్ నియోజకవర్గంలో అధికారం మార్పు జరగవలసిన అవసరం ఉందని దానికోసమే ఈ యువసంఘటన యాత్రను ప్రారంభించామని అన్నారు. ఈ దేశ రక్షణ కోసం మోదీ ఏ విధంగా అయితే కేంద్రంలె అకుంఠిత దీక్షతో పరిపాలన అవదిస్తున్నాడని అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో యువతకిచ్చిన మాట కోసం తన ఉద్యోగాన్ని సైతం రుణప్రాయంగా విడిచిపెట్టి నిరంతరం కొల్లాపూర్ ప్రజల కోసం పరితపిస్తున్న సుధాకర్ రావు కి అండగా నిలబడాలని అవసరం ఎంతైదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి బీజేవైఎం జిల్లా కార్యదర్శి మహేష్ యాదవ్, మండల అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ పరుశురాం, మధు, తదితరులు పాల్గొన్నారు.



## వరుస ఉద్యోగ నోటిఫికేషన్లను జీర్ణించుకోలేకపోతున్న బీజేపీ నేతలు



**వెల్దండ, మార్చి 17 ప్రభాతవార్త:**రాష్ట్రంలో నిరుద్యోగ యువకులకు వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంతో బీజేపీ నేతలు జీర్ణించుకోలేక కుట్రలు పన్నుతున్నారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోళి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోళి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరిగిన స్కాంలు ప్రజలందరు గుర్తిస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కోసం వరుస ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తుండటంతో బీజేపీ నేతలు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, నోటిఫికేషన్లతో యువత దూరమవుతున్నారనే భయాం దోళనలకు బీజేపీ నాయకులు గందరగోళం సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. సమావేశంలో సర్పంచ్ గోరటి శ్రీనివాస్, అంజినాయక్, నాగులునాయక్, సుభాష్, ధర్మనాయక్, శివకుమార్, రాజశేఖర్, గణేష్, మహేష్, చింటు, గోపి తదితరులు ఉన్నారు.

## భక్తి శ్రద్ధలతో బొడ్రాయి పండుగ వేడుకలు...

**వెల్దండ, మార్చి 17 ప్రభాతవార్త:**వెల్దండ మండల పరిధిలోని రాఘాయిపల్లి గ్రామంలో భక్తి శ్రద్ధలతో బొడ్రాయి పున: ప్రతిష్ట పూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ప్రాంత కాల పూజలు, గర్తన్యాసము, ఉదయం 7.26 గంటలకు మీన లగ్నయందు యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట ప్రాణ ప్రతిష్ట, కుంభనివేదన, బలిహరణ, నేత్రోన్మీలనము, విశేష షోడశోపచారి పూజ, నీరాజనము, పూర్ణాహుతి, అవభృద స్నానము, ఆశీర్వచనము కార్యక్రమాలను వేద పండితులు వేదమంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు జెడ్పీ చైర్మన్ శాంతకుమారి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గోళి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ విజితారెడ్డి, ఎంపీపీ విజయజైపాల్‌నా యక్, ఎంపీటీసీ మోతిలాల్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్‌లు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.



# నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించాలి..

### అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్

**వనపర్తి టౌన్,మార్చి 17 ప్రభాతవార్త:** వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న టీఎస్ఎస్‌పీఎస్సీ లీకేజీ అక్రమార్కులను ప్రతి ఒక్కరిని రోడ్డుమీద నిలబెట్టి కాల్చి పరేయాలని అచలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్స్ కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులను, నిరుద్యోగులను కలిసి వారి విన్నపం మేరకు అచలపక్ష ఐక్యవేదిక తో కలిసి నిరసన తెలిపారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న అక్రమార్కులకు కఠినంగా శిక్షించాలని లేకపోతే ఈ ఘటనలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన ఎద్దేవ చేశారు. తాగిన మత్తులో ఒక్క అమ్మాయిని రేప్ చేసిన వాడిని ఎన్కౌంటర్ చేసిన ప్రభుత్వం, వేలాది మంది జీవితాలతో ఆడుకున్న అక్రమార్కులను కూడా ఎన్కౌంటర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా గ్రూప్స్, బీఈడీ, ఎయిడెడ్ అభ్యర్థుల జీవితాలతో ఆడుకుంటున్న టీఎస్‌పీఎస్సీ అధికారులు కొందరు దొంగ నా....అక్రమార్కులు ఉన్నారని అన్నారు. ఇప్పటికే 8ఏళ్లుగా ఉద్యోగాలు లేక, విపరీతంగా కోచింగ్ సెంటర్లకు డబ్బులు ఖర్చు పెడుతూ, నానా ఇబ్బందులు పడుతూ, ఆర్థిక పరిస్థితులు బాలేక చదువుతూ ఉద్యోగాలు సంపాదించాలనే ఉద్దేశంతో కష్టపడుతున్న విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నారనిఅన్నారు. ఉద్యోగాలు ఉన్న డబ్బు సంపాదించేయగా అక్రమ మార్గంలో ఇలా పేపర్ లీకేజీ లతో విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నారని వారిని రోడ్డుపై నిలబెట్టి కాల్చివేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అచలపక్ష ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు మెంటెపల్లి రాములు, ఉద్యమ నాయకుడు, గండు శివ, దళితుల సంఘం నాయకుడు నారాయణ, విద్యార్థి సంఘాల నాయకులు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

# కోరిన కోరికలు తీర్చే దైవం శ్రీ పూజ్య రమణానందగిరి స్వామి..

**-నేటి నుండి నార్లోనికుంటలో స్వామివారి ఆరాధన మహోత్సవాలు**

**-ముఖ్యఅతిథిగా హాజరవుతున్న శ్రీ సదానందయోగీశ్వరులవారు**

**దేవరకద్ర,మార్చి 17 ప్రభాతవార్త:** కోరిన కోరికలు తీర్చే దైవంగా పూజలందుకొంటున్నారు దేవరకద్ర మండలం నార్లోనికుంటలోని శ్రీ పూజ్య రమణానందగిరి స్వామివారు. శ్రీ పూజ్య రమణానందగిరి స్వామి వారి 12వ ఆరాధన మహోత్సవాలు ఈ నెల 18నుండి గ్రామంలో ఎంతో కోలాహలంగా ప్రారంభం అవుతున్నాయి. ప్రతి ఏడాది గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం పక్కనున్న స్వామి దేవస్థానంలో స్వామి వారి ఆరాధన మహోత్సవాలను నార్లోనికుంటలో ఘనంగా ఎంతో భక్తి శ్రద్ధలతో సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ స్వామి వారి ఆరాధన మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీనికి గాను నిర్వహకులు,గ్రామస్థులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. హైద్రాబాద్‌లోని జుమ్మెరాత్‌బజార్ వద్దనున్న ఆత్మభోధాశ్రమ పీఠాదిపతులు,శివరామ కోటియజ్ఞ కార్యనిర్వహణ అధ్యక్షుడు శ్రీ సదానందయోగీశ్వరుల వారి అధ్వర్యంలో ఈ మహోత్సవాలు జరుగనున్నాయి.



పూజ్య శ్రీ రమణానందగిరి స్వామివారు(ఫైల్)

**స్వామివారి ఆరాధన విశేషోత్సవాలు..**

దేవరకద్ర మండలం నార్లోనికుంటలో శ్రీ రమణానందగిరి 12వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా ఉత్సవాల మొదటిరోజు స్వామి వారి సన్నిధిలో ఉదయం 8లకు అఖండ హరేరామనామ సంకీర్తన పూజా కార్యక్రమంతో ఆరాధన మహోత్సవాలకు శ్రీకారం చుడతారు. అలాగే ఈ నెల 19న భగవద్గీత హవనం,(1నుండి 18వ అధ్యాయం)కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అలాగే మహాత్ములచే ఆధ్యాత్మిక ప్రసంగాలు,మధ్యాహ్నం మహాత్ములకు సన్మానం,అన్నదానసమారాధన పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అలాగే రమణానందగిరి స్వాముల వారి శిష్యబృందం అధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను కూడ నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి పాండురంగచార్యులు,జగదీశ్వరస్వామి,శివమ్మమాత,జ్ఞానేశ్వరస్వాములు హాజరవుతున్నారు.కావున భక్తుల ఈ ఆరాధన మహోత్సవాలకు అధికసంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వహకుడు యాదయ్యచారి కోరారు.

# క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో 10వతరగతి విద్యార్థులకు పెన్నులు, పంపిణీ..

**వనపర్తి టౌన్,మార్చి 17 ప్రభాతవార్త:** క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ ఆలోచనతో 10వతరగతి విద్యార్థులకు ఉచితంగా 188మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. క్లాస్మేట్ క్లబ్ వనపర్తి పట్టణ అధ్యక్షులు రామకృష్ణ దాతృత్వంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మెన్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులనఎ చదువు మధ్యలో ఆగిపోకుండా ఉన్నత చదువులు చదివే విధంగా ప్రోత్సహించడమే క్లాస్మేట్ క్లబ్ లక్ష్యమని అన్నారు. రాష్ట్ర క్లాస్మేట్ అధ్యక్షులు వాసా రాఘవేంద్ర రావు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని అనేక మంది విద్యార్థులకు పై చదువులకు వెళ్లడానికి ఆర్థిక సహాయం అందించడం జరిగిందని ఇక మీదట కూడా ఉన్నత చదువులు చదవడానికి ఇబ్బంది ఉన్న విద్యార్థులకు చేయూతగా క్లాస్మేట్ క్లబ్ ఉంటుందని తెలిపారు. వనపర్తి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈ సంవత్సరం టాప్ మార్కులు తెచ్చుకొని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సీటు సంపాదించిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.10 చొప్పున కోర్సు అయ్యేవరకు క్లాస్మేట్ క్లబ్ సహాయం చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాంథనిక కౌన్సిలర్ చీర్ల సత్యం, పుట్టపాకల మహేష్, కోళ్ల వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తారాబాయి, చెన్న పద్మ, సునీల్ వాల్మీకి, ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్

# అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం:జడ్పీ వైస్ చైర్మెన్

**కొత్తకోట,మార్చి 17 ప్రభాతవార్త:** అందత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని జడ్పీ వైస్ చైర్మెన్ వామన్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోరి ముమ్మళ్లపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కురుమయ్య తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 10 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకొని కంటి సమస్య ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి సమస్యలు ఉండకూడదనే లక్ష్యంతో కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు అధ్యక్షుడు కొండారెడ్డి, గాడిల ప్రశాంత్, జగన్మోహన్ రెడ్డి, కటికె శ్రీనివాస్, జి.రాజ్ కుమార్, చింటు, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కంటి వైద్యశాల శిబిరాన్ని పరిశీలిస్తున్న జడ్పీ వైస్ చైర్మెన్ వామన్ గౌడ్

# పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని వసతులను కల్పించాలి

**-నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 17 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మరియు గీతాంజలి జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ మొదటి సవత్సరం ఇంగ్లీష్ పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్‌నాయక్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులను ఆయన పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష రాసే తీరును ఆయన గమనించారు. గదుల్లో చీకటి లేకుండా లైట్లను ఏర్పాటు చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా పరీక్షలను పకడ్బందిగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎక్కడ కూడా ప్రశ్న పత్రాల బహిర్గత మరియు మాస్ కాపియింగ్ జరగకుండా పకడ్బందిగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట ఇంటర్ నోడల్ అధికారి వెంకటరమణ, పరీక్షల పర్యవేక్షణ అధికారి ప్రభాకర్‌వర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్

# సీనియర్ సివిల్ జడ్జి చేతుల మీదుగా లైఫ్ మెంబర్ షిప్ పత్రాలు అందజేత..

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 17 ప్రభాతవార్త:** సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి సబిత చేతుల మీదుగా లైఫ్ మెంబర్‌షిప్ పత్రాలను న్యాయవాదులకు అందజేశారు. జిల్లా కేంద్రంలోని కోర్టు బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో సీనియర్ న్యాయవాదులతో పాటు జూనియర్ న్యాయవాదులకు లైఫ్ మెంబర్‌షిప్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బార్ అసోసియేషన్‌లో నిండుగా న్యాయవాదులు ఉండటంతో బార్ ప్రాంగణం కళకళలాడుతుందని, ఇలాగే ప్రతి సంవత్సరం కోర్టుకు కొత్త న్యాయవాదుల నమోదవుతూ ఉండటంతో కోర్టులోని కేసులను త్వరగా పరిష్కరించేందుకు మంచి అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లైఫ్ మెంబర్‌షిప్ సర్టిఫికెట్ తీసుకున్న న్యాయవాదులకు జడ్జి శుభాభినందనలు తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాసులుగుప్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సెక్రటరి ఏ.పర్వత్‌రెడ్డితో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



మెంబర్‌షిప్ పత్రాలను అందజేస్తున్న జడ్జీ సబిత

## ఎమ్మెల్సీ గెలుపుపై కౌకుంట్లలో బిజేపి సంబరాలు

**దేవరకద్ర,మార్చి 17 ప్రభాతవార్త:** దేవరకద్ర ఉమ్మడి మండలంలోని కౌకుంట్ల కొత్త మండల కేంద్రంలో శుక్రవారం బిజేపి శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవిఎన్ రెడ్డి గెలవడంతో ఈ సంబరాలను నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని వివేకానంద చౌరస్తాలో పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. ఒకరికొకరు స్వీట్లు పంచుకొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కిసాన్‌మోర్చా కార్యదర్శి సంఘాల రవీందర్‌రెడ్డి,జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, దాసరిపల్లి గ్రామ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి,నాయకులు గొల్ల అంజనేయులు,కృష్ణారెడ్డి,కోట్ల శ్రీనివాస్‌రెడ్డి,శేరి వేణుగోపాల్‌రెడ్డి,సింగారపు కృష్ణారెడ్డి,దేవారెడ్డి,సత్యన్న,కావలి అంజనేయులు,బలవర్ధన్‌రెడ్డి, వెంకటన్నలతో పాటు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రదీప్‌గౌడ్

**దేవరకద్ర,మార్చి 17 ప్రభాతవార్త:** బోథ్ నియోజకవర్గంలోని పిప్పిరి గ్రామం నుండి శుక్రవారం ప్రారంభించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎల్పీ అధినేత భట్టి విక్రమార్కతో కలసి ఆయన ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భానుప్రకాశ్‌రెడ్డి,సరోత్తంరెడ్డి,అక్కి రాఘవేంద్రగౌడ్ తదతరులు పాల్గొన్నారు.



## గోపల్‌దిన్నెలో బీజేపీ గెలుపు సంబరాలు..

**వీపనగండ్ల,మార్చి 17 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని గోపల్‌దిన్నె గ్రామంలో మార్చి 13న జరిగిన మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన తెలంగాణ అభ్యర్థి ఏవీఎస్ రెడ్డి ఎమ్మె ల్సీగా గెలిచినం దుకు,వీపనగండ్ల బీజేపీ ఉపాధ్యక్షుడు నరేష్‌యాదవ్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు బీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.



## 28వ తేదీ లోపు చెరుకు కొనుగోలు చేస్తాం..

**కొత్తకోట,మార్చి 17 ప్రభాతవార్త:** ఎన్ఎస్ఎల్ కృష్ణవేణి షుగర్ పరిశ్రమలో చెరుకును ఈనెల 28వ తేదీ లోపు కొనుగోలు చేస్తామని ఫ్యాక్టరీ యాజమాన్యం వైస్ ప్రెసిడెంట్ మనోజ్ గోయెల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 సంవత్సరానికి గాను చెరుకును ఈనెల 28వ తేదీ సాయంత్రం 6గంటల లోపు చెరుకును ఫ్యాక్టరీ కి తరలించాలని రైతులకు ఆయన తెలిపారు. నిర్ణిత సమయం లోపు సరఫరా చేయని చెరుకుని ఫ్యాక్టరీ ఎలాంటి బాధ్యత వహించదని, అంతలోపు చెరుకు ను ఫ్యాక్టరీ కి నేరుగా తీసుకొస్తే అనుమతించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## డా.బాబు జగజ్జీవన్‌రావు విగ్రహం ఏర్పాటు చేయాలి..

**వనపర్తి టౌన్,మార్చి 17 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో డాక్టర్ బాబు జగజ్జీవన్ రావు విగ్రహం ఏర్పాటు చేయాలని తెలంగాణ దళిత రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గంధం సుమన్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన భారతదేశ ఉప ప్రధాని దళిత నాయకుడు బాబు జగజ్జీవన్ రావు విగ్రహం ఏర్పాటు చేయాలని జిల్లా కేంద్రంలో ఓ మంచి స్థలం చూసి ఏర్పాటు చేయాలని అన్నారు. గతం గెలిచిన ఎమ్మెల్యేలు, మంత్రులు ఏర్పాటు చేయిస్తామని అంటున్నారని అన్నారు. స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్న నేటి వరకు వనపర్తి జిల్లా కేంద్రంలో బాబు జగజ్జీవన్ రావు విగ్రహం విగ్రహం, భవనం లేదని రాజకీయ పార్టీలకు కేవలం ఓట్లే అవసరమా అని ప్రశ్నించారు. ఏప్రిల్ 5వ తేదీన మన భారతదేశ మాజీ ప్రధాన మంత్రి బాబు జగజ్జీవన్ విగ్రహం ఏర్పాటు చేయాలని అన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ సమావేశం తీర్మానం చేయాలని, ప్రజా ప్రతినిధులు అధికారులు అందరు సహకరించాలని ఆయన కోరారు.

## కార్యకర్తలను, ప్రజలను కంటికి రెప్పల కాపాడుకుంటా...



**వెల్దండ, మార్చి 17 ప్రభాతవార్త:**కార్యకర్తలను, ప్రజలను కంటికి రెప్పల కాపాడుకుంటూ వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండల పరిధిలోని కళ్యాణవాగు తాండకు చెందిన నర్సింగ్‌నాయక్ గత కొన్ని రోజులుగా టాయిఫైడ్ వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న నర్సింగ్‌నాయక్‌ను ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. మంలో శంకర్‌నాయక్, పంతులనాయక్‌తో పాటు ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

# బ్యాంకర్ల నిర్దేశిత రుణ లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలి

## ● వనపర్తి జిల్లా ఇంచార్జీ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్

**వనపర్తి ప్రతినిధి, మార్చి 17 ప్రభాతవార్త:** బ్యాంకర్ల నిర్దేశిత రుణ లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కన్సల్టేటివ్ లెవెల్ రివ్యూ కమిటీ మీటింగ్ లీడ్ బ్యాంక్ వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో డీసీసీ సమావేశం ఏర్పాటు చేయగా జిల్లా ఇంచార్జీ కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీసీసీ అజెండా అంశాలు చర్చించారు. ఎస్‌హెచ్ జి రుణాలు 100% ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. రైతులకు అవగాహన కల్పించి రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ అధికారులు బ్యాంక్లు ప్రతి 3వ శుక్రవారం ఎఫ్ఎల్‌సీ క్యాంపులు నిర్వహించుకోవాలని కలెక్టర్ తెలిపారు. మైక్రో స్మాల్ మీడియం లోన్ లు ఇవ్వాలని ఆయిల్ ఫామ్ రైతులకు రుణాలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే పీఎం ఈజీ కింద దరఖాస్తు చేసిన వారికి తప్పక రుణాలు ఇవ్వాలని ఐడీఓసీ కార్యాలయంలో బ్యాంకు తెరవాలని ఏటీఎం ప్రారంభించాలని బ్యాంకర్లను కోరారు. బ్యాంకర్లు సిబిల్ స్కోర్ లేదని రుణాలు ఇవ్వకుండా నిరాకరిస్తున్నారని సబ్సిడీ తప్పక ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎస్సీ కార్పోరేషన్ అధికారి బ్యాంకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా లీడ్ జిల్లా మేనేజర్ అమూల్ పవర్ మాట్లాడుతూ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ ప్లాన్ కింద పురోగతి సమీక్షించడం జరిగిందని ఐటీ ఎనేబుల్డ్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ కు నిరోధించే, ఎనేబుల్ చేసే నిర్దిష్ట సమస్యలు, సమ్మిళిత వృద్ధికి బ్యాంకింగ్ అభివృద్ధికి ఆటంకాలను ఎనేబుల్ చేయడానికి తొలగించడానికి సమస్యలపై చర్చించడం జరిగింది. జిల్లా క్రెడిట్ ప్లాన్ కింద బ్యాంకుల పనితీరుపై సమీక్ష, ప్రాధాన్యత రంగానికి, సమాజంలో బలహీన వర్గాలకు రుణాల ప్రవాహం, 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ ప్రాయోజిత పథకాల కింద సహాయం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకార్పోరేషన్, పీఎంఈజీపీ/పీఎమ్ఎఫ్ఎమ్ఈ డీఐసీ/కెవిఐబీఎస్/



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంచార్జీ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్, హాజరైన బ్యాంక్ మేనేజర్లు

ఎస్‌యుఐ/ముద్ర యొక్క సమీక్ష ఎస్ఎంఈ ఫైనాన్సింగ్, ఏవైనా అడ్డంకులు ఉంటే బ్యాంకుల ద్వారా సకాలంలో డేటా సమర్పణ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎల్డీఎం అమూల్ పవర్, డీఆర్‌డీఓ నరసింహులు, వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, మల్లికార్జున్, యాదగిరి, హార్టికల్చర్ అధికారి సురేష్, వెటర్నరీ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, డీటీడీ శ్రీనివాసులు, ఏపీఎంలు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

## ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి దంపతులు



శ్రీరామ నామ లిఖిత ధ్వజస్తంభ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి జమున దంపతులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి17 ప్రభాతవార్త:** శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరా మచంద్ర రామానుజ జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ ధరాచార్య స్వామిజీ మహా రాజ్ వారి కరకమలములచే మార్చి 17న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య క్షేత్రంలో అసర్ఫి భవన్ దగ్గర నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి దంపతులు శ్రీ రామ నామ స్థూపాన్ని ప్రతిష్టించనున్నారు. కావున ఆ స్థూపంలో ప్రతిష్ట కార్యక్రమంలో శ్రీ రామ నామ లిచత 28 కోట్ల పుస్తకాలను స్థూపం క్రింద పెట్టి శ్రీరామ నామ స్థూప ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మర్రి జమునా దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి 28కోట్ల శ్రీరామ పుస్తకాలను అయోధ్య క్షేత్రంలో ప్రతిష్టించారు.

## టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం



కార్యకర్తలతో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ యాదిలాల్

**కల్వకుర్తి, మార్చి 17 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీతోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ యాదిలాల్ అన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌ల పిలుపుమేరకు ఇంటింటికి టీడీపీ కార్యాక్రమంలో భాగంగా శుక్రవారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో రైతులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా యాదిలాల్ మాట్లాడుతూ ప్రజా రైతు సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తిమ్మయ్య, వెల్దండ మండల అధ్యక్షులు వజ్రలింగం, రైతులు ఉన్నారు.

## మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జెడీచైర్‌పర్సన్, ఎంపీపీ



మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న జెడీచైర్‌పర్సన్ స్వర్ణమ్మ, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 17, ప్రభాతవార్త:** ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి డా.వీ శ్రీనివాస్‌గౌడ్‌కు మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, భూత్పూర్ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి శుభాకాంక్షలు తెలుపడానికి నాయకులు, అభిమానులు, పార్టీ శ్రేణులు కార్యాలయానికి చేరుకోవడంతో సందడిగా మారింది.

## యువతి అదృశ్యం : కేసు నమోదు

**పెబ్బేరు, మార్చి 17 ప్రభాతవార్త:** మండల పరిధిలో శుక్రవారం యువతి అదృశ్యమై కేసు నమోదయ్యిందని ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా మండల పరిధిలోని బూడిదపాడు గ్రామానికి చెందిన మహేశ్వరి డిగ్రీ చదివే విద్యార్థిని అదృశ్యమైనట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీన ఎప్పటిలాగే మండల కేంద్రంలోని వీరభద్ర కళాశాలకు వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది కాలేజీకి రాకపోవడంతో తోటి విద్యార్థులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తండ్రి దానయ్య తెలిసిన వారికి సమాచారం ఇచ్చినప్పటికీ ఆచూకీ లభించడం లేదు. అదే గ్రామానికి చెందిన యువకుడు కూడా కనిపించక పోవడంతో బాలరాజుపై అనుమానం ఉందని దానయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పెళ్లి వేడుకల్లో పాల్గొన్న అడ్డాకుల జడ్పీటీసీ

**అడ్డాకుల, మార్చి 17 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన కావలి గోవిందు కుమారుడు నరేష్ లావణ్య ల పెళ్లి వేడుకలో మండల జడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి పాల్గొనినూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు అడ్డాకుల మండల సింగిల్‌విండో అధ్యక్షులు జితేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దూరి చంద్రమోహన్ రెడ్డి, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు రంగన్నగౌడ్, మండల యువజన సంఘం అధ్యక్షులు ఎలుసరిబాలరాజు, బీఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు డి.శ్రీనివాస్ యాదవ్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు జహంగీర్ గోరి, గ్రామ కమిటీ యూత్ అధ్యక్షులు మహేష్ యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు వరప్రధాయిని సీఎం రిలీఫ్ ఫండ్

## ● కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**కల్వకుర్తి, మార్చి 17 ప్రభాతవార్త:** పేదలకు వరప్రధాయిని సీఎం రిలీఫ్ ఫండ్ అని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. పేద ప్రజలు కార్పొరేట్ స్థాయి వైద్యం పొందడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో భరోసానిస్తుందని ఆయన తెలిపారు. కల్వకుర్తి మండలం లింగసానిపల్లి గ్రామానికి చెందిన భీమయ్యకు రూ.14వేలు, వెల్దండ మండలానికి చెందిన తాగూర్‌కు రూ.21వేల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ వల్ల ఎంతో మంది నిరుపేదలు లబ్ధి పొందారని, నిరుపేదలు ఎంతో ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ప్రాణాలతో జీవిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రమాదాల్లో గాయపడ్డవారు, అనారోగ్యాలతో బాధపడుతున్న వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థిక సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ధరఖాస్తు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, వైస్ చైర్మన్ షాహేద్, మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, ఎంపీపీ సామ మనోహర చెన్నకేశవ, వైస్ ఎంపీపీ కొండూర్ గోవర్ధన్, వెల్దండ జెడ్పీటీసీ విజితారెడ్డి, ఎంపీపీ విజయ జైపాల్‌నాయక్, నాయకులు జంగయ్యయాదవ్, మనోహర్‌రెడ్డి, బోజిరెడ్డి, బాలయ్య తదితరులు ఉన్నారు.



### సూపర్ లగ్జరీ బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే...

వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి ప్రయాణీల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కల్వకుర్తి ఆర్టీసీ డిపో నుంచి 2 ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను జెడ్పీ చైర్ పర్సన్ శాంతకుమారితో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణీకుల సౌకర్యార్థం లగ్జరి బస్సులను ప్రారంభించామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# అక్రమ అరెస్టులతో ప్రజాగొంతుకను నొక్కే ప్రయత్నం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

**గద్వాల ప్రతినిధి, మార్చి 17 ప్రభాతవార్త:** టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీల విషయంపై సమగ్ర విచారణ జరిపి హైకోర్టు సిట్ విచారణ జరపాలని నేడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎబివిపి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి పిలుపు మేరకు జోగులాంబ గద్వాలజిల్లా నాయకులను అక్రమంగా ముందస్తు అరెస్టు చేసి ప్రజల గొంతుకను నొక్కే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చర్యలు ప్రభుత్వ సిగ్గుచేటు పనికి నిదర్శమని లీకేజీల ప్యాకేజీకి కారణమైన టిఎస్‌పిఎస్‌సి నిందితులను అరెస్టు చేసి నిరుద్యోగుల పక్షాన నిలబడి 30 లక్షల మంది నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఉద్యమిస్తున్న ఎబివిపి కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ముందస్తు అరెస్టులు చేయడం ఎంతరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీలో కారణమైన నిందితులను కఠినంగా శిక్షించకుండా నామమాత్రంగా 9 మందిని తూతూ మంత్రంగా అరెస్టు చేసి ప్రజలను మోసం చేసేవిధంగా ప్రభుత్వం ఉందని అన్నారు. వెంటనే టిఎస్‌పిఎస్‌సి ఛైర్మన్ జానారెడ్డిని, అదేవిధంగా టీఎస్‌పిఎస్‌సి ఛైర్మన్ జానారెడ్డిని అదే విధంగా టిఎస్‌పిఎస్‌సి ఛైర్మన్‌తో పాటు కారకులైన వారినందరిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అలాగే టిఎస్‌పిఎస్‌సిలో నిర్వహించిన పరీక్షలు ఏవైతే ఉన్నాయో అన్ని పరీక్షలను రద్దుచేసి మళ్లీ తిరిగి



మాట్లాడుతున్న ఎబివిపి నాయకులు

నిర్వహించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెంటనే పదవికి రాజీనామా చేయాలని అన్నారు. అక్రమ అరెస్టులు, అక్రమ కేసులు ఉద్యమాన్ని ఆపలేవని నిరుద్యోగుల పక్షాన మేము అండగా ఉండి పోరాడతామని అన్నారు.

# హాత్ సే హాత్ జోడో యాత్రకు దూరంగా మొగిలి సత్యారెడ్డి

● కాంగ్రెస్ అసంతృప్తి వర్గంలో చేరుతారనే ప్రచారం? ● బీఆర్ఎస్‌లోకి తీసుకునేందుకు చర్చలు కొనసాగుతున్నట్లు ప్రచారం?

**పెద్దమందడి, మార్చి 17 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ నేతృత్వంలో చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రకు వనపర్తి డీసీసీ కార్యదర్శి పెదమందడి కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగిలి సత్యారెడ్డి దూరంగా అంటిముటనట్లుగా ఉండడం కాంగ్రెస్ కార్యకర్తలను అయోమయానికి గురి చేస్తుంది. పెద్దమందడి మండలంలో గురువారం, శుక్రవారం మాజీ మంత్రి డా.జి.చిన్నారెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రకు మొగిలి సత్యారెడ్డి గైర్హాజరు కావడంపై కార్యకర్తలు భిన్నఅభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో పెద్దఎత్తున చిన్నారెడ్డిని వ్యతిరేకిస్తూ అసమత్తి వర్గం వేరు కుంపటిని ఏర్పాటుచేసుకున్న ఏపథ్యంలో మొగిలి సత్యారెడ్డి గైర్హాజరు కావడం కొత్త చర్చకు దారి తీసింది. ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నం చేస్తూ జిల్లాలో పలు మండలాల్లో చేపట్టే కార్యక్రమాలకు ఆర్థిక సాయం చేస్తూ యువతకు క్రికెట్ కిట్లు ఇస్తున్న మొగిలి సత్యారెడ్డి కాంగ్రెస్ పార్టీకి అకస్మాత్తుగా దూరంగా ఉండడంపై అసమ్మతి వర్గంలో చేరుతారనేప్రచారం నియోజకవర్గంలో కొనసాగుతుంది. ఇప్పటికే



మొగిలి సత్యారెడ్డి (ఫైల్)

కాంగ్రెస్ అసమ్మతి వర్గం మేఘారెడ్డి గ్రూప్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో మరి సత్యారెడ్డి దారి ఎటువైపని కార్య కర్తలు చర్చించుకుంటున్నారు. గత 2,3 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీకి పెద్దమందడి మండలంలో ముందుండి నడిపించిన సత్యారెడ్డి అలక వహించడం, మౌనం వెనక ఆంత ర్యం ఏమిటని కార్యకర్తలు ప్రశ్నించుకుంటు న్నారు. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ కు చెందిన కొందరు కార్యకర్తలు, నాయకులు మేఘారెడ్డి బీఆర్ఎస్ పార్టీ ని వీడిన నేపథ్యంలో మొగిలి సత్యారెడ్డిని బీఆర్ఎస్‌లోకి చేర్చుకునేందుకు చర్చలు కొనసాగుతున్నట్లు బీఆర్ఎస్ కార్యకర్తలు తెలిపారు. ఇదిలా ఉంటే ఈ విషయమై మొగిలి సత్యారెడ్డి ని ప్రశ్నించగా కరోనా తరువాత తనకు వ్యాపారంలో కొద్దిగా ఇబ్బందులు ఏర్పడ్డాయని అందువల్లే తాను పెద్దగా బయటికి రాలేకపోతున్నానని గురువారం నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్రలో మోజర్లలోని తన ఇంటి దగ్గరే కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేసానని పేర్కొన్నారు.

# పొలంకాడ ఉన్న నీళ్లు పొయ్యి కాడికి తెచ్చా

## పేట ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి

**కోయిల్‌కొండ, మార్చి 17 ప్రభాతవార్త:** పొలంకాడ ఉన్న నీళ్లపొయ్యి కాడికి తెచ్చి మహిళల కష్టాలను తీర్చానని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అంకిళ్ల గ్రామ పంచాయతీలో గల మొర్రోనితండా, బోట్యనాయక్ తండాలో ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ జెండావిష్కరణ చేశారు. అనంతరం గిరిజన నాయకుడు గోవిందనాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో మంచినీటి కోసం వ్యవసాయం బోరు బావుల దగ్గరకెళ్లి నీళ్లు తెచ్చుకునే పరిస్థితి ఉండేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక పొలంకాడ ఉన్న నీళ్లు పొయ్యికాడికి తెచ్చి మహిళల ఇబ్బందులు తీర్చిన ఘనత కెసిఆర్‌కు దక్కిందన్నారు. బోట్యనాయక్ తండాకు తారురోడ్డు వేయడానికి రూపాయలు 21 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. డ్రైనేజీ నిర్మాణానికి మరో ఐదు లక్షల రూపాయల నిధులను వెంటనే మంజూరు చేస్తున్నానని ఎమ్మెల్యే ప్రకటించారు. అంకిళ్ల గ్రామ సర్పంచ్ రజిత రవిందర్‌రెడ్డి మా గ్రామంలో ముదిరాజ్ కులస్తులు ఎక్కువగా ఉన్నారని వారికోసం ముదిరాజ్ భవన నిర్మాణం మంజూరు చేయాలని ఎమ్మెల్యేలను



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కోరగా వెంటనే ఎమ్మెల్యే ముదిరాజ్ భవన నిర్మాణానికి రూ. 51 లక్షలు మంజూరు చేస్తున్నానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి శశికళ, జడ్పీటిసి విజయభాస్కర్‌రెడ్డి, మండల టిఆర్ఎస్అధ్యక్షుడు బి.కృష్ణ, మండలసింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తండావాసులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకుల సంబరాలు



ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవిఎన్‌రెడ్డి గెలుపుతో సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

**మూసాపేట, మార్చి 17 ప్రభాతవార్త:** మూసపేట మండల పరిధిలోని వేముల స్టేజ్ హనుమాన్ ఆలయం దగ్గర శుక్రవారం వెలువడిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో బిజెపి పార్టీ బలపర్చిన ఏవిఎన్ రెడ్డి విజయం సాధించడంతో మండల బిజెపి నాయకులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపి స్వీట్స్ పంచారు. అనంతరం హనుమాన్ ఆలయం దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బంగారు రవిందర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు చెన్నంపల్లి శేఖర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ గద్వాల తిరుపతిరెడ్డి, కోశాధికారి ఎద్దుల గోవర్ధన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు టికెనరసింహ, శక్తికేంద్ర ఇంఛార్జిసి.జి. మధు, సూర్యప్రకాష్, మల్లేష్, రోహిత్, కెవి ప్రవీణ్, బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతదేహాన్ని పరిశీలిస్తున్న నాగం జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 17 ప్రభాతవార్త:** బిజినపల్లి మండలం లింగసానిపల్లి గ్రామానికి చెందిన మేకల లక్ష్మయ్య కుమారుడు మేకల బాలకృష్ణ (22) గురువారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి నాగర్‌కర్నూల్ ఏరియాప్రభుత్వాసుపత్రిలో పరామర్శించిమృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు అర్థం రవి, పాండు తదితరులు ఉన్నారు.

## 20వ తేదీలోపు గురుకుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

**కొత్తకోట, మార్చి 17 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల 5వ తరగతి ప్రవేశానికి ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సాంఘీక సంక్షేమ బాలికల, బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మాలతి, శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయసంస్థఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశానికై ఏప్రిల్ 23వ తేదీ ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం1గంటల వరకుప్రవేశ పరీక్ష నిర్వహిం చడం జరుగుతుందనిఅన్నారు. దీనికి 4వతరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

## ఏవిఎన్ రెడ్డి గెలుపు ఉపాధ్యాయుల విజయం

### తపస్ ఆధ్వర్యంలో ఘనంగా విజయోత్సవ సంబరాలు



ఏవిఎన్‌రెడ్డి గెలుపుతో విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

**మక్తల్, మార్చి17 ప్రభాతవార్త:** స్థానిక పట్టణంలోని వివేకానంద చౌరస్తాలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఏవిఎన్‌రెడ్డి గెలుపొందడం పట్ల ఘనంగా విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా తపసన, బిజెపి ప్రతినిధులు మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, భారతీయ జనతా పార్టీ బలపర్చిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అభ్యర్థి ఏవిఎన్‌రెడ్డి గెలుపొందడం ఉపాధ్యాయుల విజయంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా టిపియుఎస్ మక్తల్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద చౌరస్తాలో టపాకాయలు పేల్చి ఒకరికొకరు స్వీట్లు పంచుకుని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మక్తల్ మండల గౌరవ అధ్యక్షులు వి.భీంరెడ్డి, అధ్యక్షులు బి.రవిందర్, ప్రధాన కార్యదర్శి రాకేష్‌కుమార్, కోశాధికారి రవిందర్‌రెడ్డి, నరేష్‌కుమార్, నరసింహులు, సురేష్, తిరుమలరావు, కురుమయ్య, రాజగోపాల్, జైపాల్, లక్ష్మినారాయణ, భాజపా అసెంబ్లీ కన్వీనర్ కర్ని స్వామి, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షులు డి. నరసింహారెడ్డి, కాచువార్ ఎంపిటిసిబలరాంరెడ్డి, బాల్చేడ్ మల్లికార్జున్, చిట్యాల ఎంపిటిసి రామలింగం, చందాపురం చంద్రశేఖర్, కనకరాజు, వాటికి మల్లేష్, బాబుగౌడ్, చందాపురం కొండయ్య, కావలి సత్యనారాయణ, రాజు, స్వాగత్ సత్యనారాయణ, భారతీయ కిసాన్ సంఘ జిల్లా అధ్యక్షులు కావలి వెంకటేష్, విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షులు సత్యనారాయణగౌడ్, భజరంగ్‌దళ్ ప్రతినిధులు భాస్కర్‌రెడ్డి, వాకిటి రమేష్, నరేష్‌కుమార్, ఎబివిపి నాయకులు వంశి, వినయ్, శరణ్, వినయ్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### ● సిఐ సీతయ్య



**మక్తల్, మార్చి 17 ప్రభాతవార్త:** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండా లని సీఐ సీతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల టెక్నాలజీతో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురై చాలా మంది ప్రజలు సైబర్ నేరాల బారిన పడుతున్నారని సైబర్ నేరగాళ్లు చూపే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఒకవేళ సైబర్ నేరాల బారిన పడినవారు ఉంటే వెంటనే 1930 లేదా డయల్ 100కి కాల్‌చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలు మీకు గిఫ్టులు వచ్చాయని, మీరు లక్కి డ్రాలో గెలుపొందాలని, ఆన్‌లైన్‌లో తక్కువ ధరకే వాహనాలు, వస్తు వులు దొరుకుతున్నాయని ఇలా మోసాలు చేయడం జరుగుతుందన్నారు. కస్టమర్ కేర్ నంబర్‌ను సంబంధిత వెబ్‌సైట్ నుండి మాత్రమే తీసుకో వాలని, సైబర్ నేరాలు గూగుల్‌లో నకిలీ కస్టమర్ కేర్ నంబర్లను ఉంచి సైబర్ మోసాలకు పాల్పడుతున్నార న్నారు. జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌లను మీ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసినప్పుడు మీ ఫోన్‌లో ఉన్న అన్ని ఫోన్ నంబర్లు ఫొటోలు, మీ వ్యక్తిగత వివరాలు యాప్, మీ అనుమతి లేకుండా తీసుకుంటారు. త్వరలో లోన్ తిరిగి కట్టిన ఎక్కువ డబ్బులు కట్టమని ఆ వివరాలతో మిమ్మల్ని వేధింపులకు గురిచేస్తార న్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేసి మీ పేరుమీద మీయాప్‌లో లోన్ వచ్చింది కావాలంటే యాప్ ఇన్‌స్టాల్‌చేసి చెక్ చేసుకోండి అంటే నమ్మకండి ఆ యాప్ ద్వారా మీ వ్యక్తిగత వివరాలు సేకరించి మోసి చేస్తారని సూచించారు.

# పెండ్లి పిలుపు.. మారింది!

- వాట్సాప్ ద్వారానే ఆహ్వానాలు
- పెళ్ళి ఆహ్వానంలో కొత్త ట్రెండ్
- సాంప్రదాయం కోసమే కొన్ని కార్డులు ప్రింటింగ్
- గతంలో ఒక్కో పెళ్ళికి వెయ్యి ఉంటే..ఇప్పుడు కేవలం 200లోపే
- ఇళ్ళకు వెళ్లి కార్డులు ఇచ్చే రోజులు మారాయి



**దేవరకద్ర,మార్చి 17 ప్రభాతవార్త:** మా ఇంట్లో పెళ్ళికి రండి..అంటూ ఆప్యాయమైన పెళ్ళి పత్రిక పలకరింపు మారింది..ఒకప్పుడు మేళతాళాలతో బంధువుల ఇళ్ళకు తిరుగుతూ బొట్టు పెట్టి మరీ పత్రిక చేతికి ఇచ్చి ఆహ్వానించేవారు.ఒక వేళ ఇంట్లో ఎవరు లేకుంటే గుమ్మానికి బొట్టుపెట్టి..పెళ్ళి కార్డు తలుపులకు పెట్టేవారు. దూరంగా ఉన్న ఊళ్ళకు ప్రింట్ చేయించిన కార్డులను వారి గ్రామాలకు వెళ్ళి మరి ఇచ్చి ఆహ్వానించేవారు. ఈ ఆనవాయితీ కొన్ని గ్రామాలలో కొనసాగుతున్నా..మారుతున్న కాలం.. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం..వల్ల ఆ సాంప్రదాయానికి స్వస్తి పలికారు.నామమాత్రంగా కేవలం 200 కార్డులు,అంతకన్న కాస్త ఎక్కువ,తక్కువగా ప్రింట్ చేయించి అనిదనిపిస్తున్నారు. సోషల్‌మీడియా ద్వారా బంధువులు,స్నేహితుల గ్రూపు తయారుచేసి అందులో కార్డు పెట్టి పిలిచే విధానానికొచ్చింది.వాట్సాప్‌లలో కార్డులు పెడుతున్నారు. కొందరికి ఫోన్ చేసి మాపెళ్ళికి రండని సెలవిస్తున్నారు. రోజురోజుకు మన పెళ్ళి పిలుపులు ఈ విధంగా మారాయి.

**నెలరోజుల నుంచే కార్డులు పంచేవారు:** పెళ్ళి పెట్టుకొన్నామంటే కార్డుల పనే చాలా ఉండేది.పెళ్ళి పని ఒక ఎత్తు ఇయితే కార్డుల పంపిణీ ఒక ఎత్తు ఉండేది. కార్డుల పంపిణీ గతంలో కత్తిమీద సాములా తయారయ్యేది. ఎవకిరి అయితే కార్డులు ఇవ్వకుంటే వారు పెళ్ళికి వెళ్ళే వారు కాదు. ఉందుకంటే మాకు పెళ్ళి కార్డు ఇయ్యలేదనేవారు.పెళ్ళికి నెల రోజుల ముందునుండే ఈ సందడి ప్రారంభమయ్యేది. బంధువులు ఉండే ఊళ్ళకు కొంతమందికి తలా ఇన్ని కార్డులు ఇచ్చి పంచడానికి పంపేవారు. ఇళ్ళలో వారు లేకుంటే ఇంటి పక్క ఉన్న వాళ్ళకు ఇచ్చి మరీ చెప్పి వచ్చేవారు.ఇప్పుడు కేవలం రోజుల్లోనే వాట్సాప్‌లలోపెళ్ళి ఆహ్వానాలు పెట్టేస్తున్నారు.లేదా నోటిమాటలతోనే చెప్పేస్తున్నారు.పెళ్ళి వీడియోల ప్రోమోలు వాట్సాప్‌లలో సెండ్ చేసి ఆహ్వానిస్తున్నారు.నెల కాదుకదా కేవలంసెకండ్లలోనే పెళ్ళి ఆహ్వానాలను పంపే స్థాయికి ఇప్పుడు చేరుకొన్నారు. దీనంతటికి పెరిగిన సాంకేతికనే ప్రధాన కారణం..

**పెండ్లి కార్డు ఇలా..:** నాటి పెళ్ళి పత్రికల్లో సీతారాములుండేవారు..సీతాదేవి వరమాలతో సిగ్గులొలికిస్తుంటే రాముడు కోదండా ధారుడై ఓరచూపులతో సీతమ్మను చూస్తుండేవారు..క్రమంగా వాళ్ళ స్థానంలోకి వధూవరులు వచ్చేశారు.పెళ్ళి కార్డులు ప్రింటింగ్ ప్రెస్‌ల నుండి కాకుండా ..ఫోటోస్టూడియోల నుండి ఫోటోల రూపంలోనే వచ్చేశాయి.ఇప్పటి పెళ్ళి కార్డు ఈ మెయిల్, వాట్సాప్‌లలో వస్తుంది.

**వాట్సాప్ గ్రూపులో పెళ్లి సందడి:** బ్రహ్మణుడు లగ్న పత్రిక రాసింది మొదలు..పెళ్ళి సందడి ప్రారంభమైనట్లు మెహంది,సంగీత్,మంగళస్నానాలు,పెళ్ళి తేది,సమయం,వేదిక మొదలు అన్నిటిని తెలిపే విధంగా ఒక వాట్సాప్ గ్రూప్..పెళ్ళి జరుగుతున్న వారి ఇంటి పేరుతో క్రియేట్‌చేస్తారు.అందులో దూరపు.దగ్గరి బంధువులు,స్నేహితుల ఫోన్ నెంబర్లన్నీ చేర్చుతున్నారు. అందులో పెళ్ళి ప్రారంభమైనప్పటి నుంచి ఆ ఫోటోలను అందులో ఆప్‌లోడ్ చేసున్నారు. అందులో పెళ్ళికి హాజరైన వారు నూతన వధూవరులతో దిగిన ఫోటోలను సైతం అప్‌లోడ్ చేస్తున్నారు.

**గ్రూప్ కాల్‌లో పెళ్ళి తతంగం:** పెళ్ళిళ్ళకు కొన్ని కారణాల చేత హాజరుకాలేకపోయిన వారికోసం పెళ్ళి జరుతుండగానే గ్రూప్ కాల్ చేసి ప్రత్యక్షంగా చూయించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీని వల్ల పెళ్ళిళ్ళకు హాజరుకాకున్న హాయిగా ఇంట్లోనే కూర్చోని పెళ్ళి తతంగాన్ని చూస్తున్నారు.

# మహానగరంగా.. మహబూబ్‌నగర్..!

(మొదటి పేజీ తరువాయి భాగం)

వద్ద ద్వీపం(ఐలాండ్) పనులు కొనసాగుతున్నాయి.

**షూటింగ్ స్పాట్‌గా.. కేసీఆర్ ఎకో అర్బన్ పార్క్:** జడ్చర్ల మీదుగా మహబూబ్‌నగర్‌కు నిత్యం వేలాది మంది ప్రయాణం సాగిస్తుంటారు. ఎండాకాలంలో కనీసం ఎక్కడైనా నిలుబడేందుకు చెట్టు నీడ కూడా దొరికేది కాదు. మయూరి నర్సరీ ఉన్నా..నాలుగు మొక్కలు, ఎండిపోయిన చెట్టు తప్పా కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు నీడ కూడా ఉండేది కాదు. మయూరి పార్క్‌ను రూ.7కోట్లతో 2087 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద అర్బన్ ఎకో పార్క్‌గా రూపొందించారు. లాండ్ స్కేప్, గార్డెనింగ్,చిల్డ్రన్ ప్లే ఏరియా, వెదురు కాటేజీ,ఫౌంటేన్, రైఫిల్‌షూటింగ్, కానోపీ వాక్, జిప్ సైక్లింగ్, నెట్ క్లైంబింగ్, రెయిన్ ఫారెస్ట్,వాటర్ ఫాల్స్,నైట్ క్యాంపింగ్ సైట్,పిల్లల బోటింగ్ తదితర సౌకర్యాలతో నిత్యం వేలాది మందికి సేత తీరుతూ ఆహ్లాదం పొందుతూ షూటింగ్ స్పాట్‌గా మారింది.

**నేడు రాకపోకలు గేటుపైనుంచే..**2014కు ముందుకు వెళ్లి ఒక్కసారి ఆలోచిద్దాం..బ్రిడ్జి కట్టే అవకాశం ఉన్నా.. కట్టలేని పరిస్థితి. ప్రాణపాయం ఉన్నా ఖర్మకాలి గేటు పడిందంటే ట్రైన్ వచ్చే సమయం అయ్యిందంటే బిక్కు బిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకునే దుస్థితి. కిలోమీటర్ల బ్రిడ్జి అవతల వాహనాలు జామ్ అయితే..దవాఖానకు వెళ్లకముందే మధ్యలోనే పాణం విడిచిన సంఘటనలు ఎన్నో చూశాం. మరి నేడు స్వరాష్ట్రంలో ఏడాదిలోనే బ్రిడ్జి పూర్తి చేసి రవాణ కష్టాలను తీర్చింది ఎవరూ..అప్పన్నపల్లి బ్రిడ్జి అవ తలే ప్రాణాలు పోతున్నా పట్టించుకోనిది ఎవరూ..ఇప్పుడు బ్రిడ్జీ పూర్తి చేసి ప్రయాణం సాఫీగా చేసిందంది ఎవరూ..

**తొలి మెడికల్ కళాశాల..** వైద్య విద్య అందని ద్రాక్షలా ఉండేది. డాక్టర్ కోర్స చదవాలంటే ప్రైవేట్‌లోనే, పెద్ద పెద్ద పట్టణాలకు వెళ్లే చదవాలనే పరిస్థితి నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలోనే వైద్య విద్య పొందే అవకాశం ఏర్పడింది.



కేసీఆర్ ఎకో అర్బన్ పార్క్

రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోనే తొలి మెడికల్ కళాశాల పాలమూరులో ఏర్పాటు చేశారు ముఖ్యమంత్రి కేసీఆర్. 75ఎకరాల స్థలంలో రూ.480 కోట్లతో 150 సీట్లు గల ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటైంది. దానికి అనుబంధంగా జిల్లాసుపత్రిని 500 పడకల ప్రభుత్వ జనరల్ దవాఖానగాఅప్‌గ్రేడ్ చేశారు.

**అన్నీ కార్యాలయాలు ఒకే చోట...** నూతన కలెక్టరేట్ సముదాయం నిర్మాణంతో ప్రజలకు పాలన మరింత చేరువైనది. గతంలో ఒక్కో కార్యాలయం ఒక్కో చోట ఉండడంతో వ్యయ ప్రయాసతో కూడుకున్నది. పాలకొండ శివారులో 22ఎకరాల జాగలో రూ.55కోట్లతో గతంలో ఎన్నడూ లేనంత సౌకర్యాలతో సువిశాలంగా,రాకపోకలకు అనుకూలంగా నిర్మాణం చేపట్టారు. మూడు అంతస్తుల్లో 1.50లక్షల చదరపుఅడుగుల కార్యాలయం కార్పెట్ ఏరియాతో మొత్తం 89గదులు, సెంట్రల్ ఏసీ సౌకర్యాలతో 500 మందికి సమావేశపు హాల్ ఏర్పాటు చేశారు. భవన ఆవరణలో శాశ్వత హెలీప్యాడ్ సౌకర్యంతో సువిశాల పార్కింగ్‌తోపాటు హరితహారం మొక్కలతో ఆహ్లాదంగా నిర్మించబడింది.

**బైపాస్ రోడ్డు..** బైపాస్ రోడ్డుతో సకల వాహనదారులకు మరింత వెసులుబాటు అయింది. రాయిచూర్, కర్ణాటక, నారాయణపేట లాంటి ప్రాంతాలకు వెళ్లే హెవీ వాహనాలు మహబూబ్‌నగర్ పట్టణం గుండా వెళ్లాల్సి వస్తే టౌన్‌లో చాలా ఇబ్బందిగా మారేది. గతంలో అసలే ఇరుకు రోడ్లు కావడంతో ట్రాఫిక్ జామ్ అయితే వాహనాదారులు చాలా అవస్థలు పడేవారు. మహబూబ్‌నగర్‌కు మణిహారంగా రూ.96.70కోట్లతో నాలుగు వరుసల బైపాస్ రోడ్డు 9.058 కిలోమీటర్ల పొడవు,150 ఫీట్ల వెడల్పుతో నిర్మించబడింది. నేడు రాయిచూర్, నారాయణపేట వైపు వెళ్లేవారికి మహబూబ్‌నగర్ పట్టణం నుంచి వెళ్లే పనిలేకుండా బైపాస్ వెళ్లడానికి మంచి అవకాశం ఏర్పడింది. పాలమూరు పట్టణంలో రోడ్ల విస్తరణతో ప్రయాణం సాఫీగా మారింది. మెయిన్ రోడ్డు వెంట గ్రీనరీ, సెంట్రల్ లైటింగ్, లింక్ రోడ్డు రైల్వే స్టేషన్ రోడ్డు, చౌరస్తాల అభివృద్ధితో పట్టణ రూపురేఖలు మారిపోయాయి.



# కంపోస్టు ఎరువు తయారీపై దృష్టి సారించాలి

(మొదటి పేజీ తరువాయి భాగం)

తక్కినవి కూడ అప్‌లోడ్ చేయాలని చెప్పారు. తక్కినవి కూడా అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఎంపిఓలు నెలలో తప్పనిసరిగా 16 గ్రామ పంచాయతీలను తనిఖీ చేయాలని గ్రామాలకు వెళ్లిప్పుడు డంపింగ్ యార్డులను సందర్శించాలని ఆదేశించారు. ఈనెలాఖరునాటికి అన్ని గ్రామ పంచాయతీలలో పన్నుల వసూలు పూర్తి చేయాలనిఅన్నారు. పౌర సేవలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటిలని తక్షణమే పరిష్కరించాలని చెప్పారు.ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో సరాసరి కూలీల సంఖ్య 41 ఉందని, ఈ సంఖ్యను పెంచాలని ఆదేశించారు. కూలీలు పనిచేసే చోట ఓఆర్‌ఎస్‌ప్యాకెట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. మైనార్టీ శాఖ ద్వారా అమలు చేస్తున్న ఆర్థిక చేయూత పథకం కింద లబ్దిదారుల ఎంపిక జాబితాలను పంపించాలని ఎంపిడిఓలను ఆదేశించారు. గ్రామ పంచాయతీలకు అధిక మొత్తంలో విద్యుత్ బిల్లులు రాకుండా అనవసరంగా విద్యుత్ వినియోగాన్ని తగ్గించే ఏర్పాటు చూడాలని తెలిపారు. వైకుంఠధామాలలో అంత్యక్రియలు జరిగే విధంగా గ్రామస్థాయిలో ప్రజలను చైతన్యవంతం చేయాలని, ఒకవేళ సౌకర్యాలు లేక అంత్యక్రియలు చేయనట్లయితే అన్ని వైకుంఠధామాలలో విద్యుత్ కనెక్షన్, నీటి సౌకర్యం, టాయిలెట్ సౌకర్యం, బయోఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగాణలలో భాగంగా గుర్తించిన అన్ని స్థలాలలో తక్షణమే పూర్తి చేయాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్దేశించిన డిజైన్‌కనుగుణంగానే గ్రామీణ క్రీడాప్రాంగణాలు నిర్మించాలని అన్నారు ఈ శ్రామ్ కింద అసంఘటిత కార్మిక రంగంలో పనిచేసే కార్మికులందరికి రిజిస్ట్రేషన్ చేయించాలని,సోషల్ ఆడిట్ రికవరిపై దృష్టిసారించాలని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డిఆర్‌డిఓ యాదయ్య, ఏపిడి జకియా సుల్తానా, డిపిఓ వెంకటేశ్వర్లు, డివిజనల్ పంచాయతీ అధికారి, ఎంపిడిఓలు, ఎంపిఓలు,పంచాయతీ కార్యదర్శులు ఈవిడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.



విడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి.రవికుమార్

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలే వచ్చే ఎన్నికలకు నాంది

- బిజెపి నాయకులు
- ఘనంగా బిజెపి విజయోత్సవ సంబరాలు

**ఇటిక్యాల, మార్చి 17 ప్రభాతవార్త:** ఈనెల 13వ తేదీ జరిగిన రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తపస్ ఉపాధ్యాయ సంఘం నుంచి బరిలో నిలిచిన ఏవిఎన్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే ఎమ్మెల్సీగా గెలుపొందారని ఈ ఎన్నికలే వచ్చే 9 నెలల్లో జరగనున్న సాధారణ ఎన్నికలకు నాంది కానున్నాయని బిజెపి పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రజలు సిద్దంగా ఉన్నారని జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు కెకెరెడ్డి, కార్యవర్గ సభ్యులు తిమ్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డిలు అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి పార్టీ బలపరిచిన ఎన్నికల్లో ఏవిఎన్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలుపొందడంతో శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో బిజెపి పార్టీ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించుకుని స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎన్నికలే రాబోయే ఎన్నికలకు కెసిఆర్ ప్రభుత్వానికి చెంపపెట్టు కానున్నాయని తెలంగాణలో రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, ఉద్యోగులు అన్ని వర్గాల ప్రజలు బిజెపి పార్టీ వెంట ఉన్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కార్యక్ర మంలో మండల బిజెపి అధ్యక్షులు జగదీష్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కెకెరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తిమ్మారెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి సంపత్, మండల ఉపాధ్యక్షులు శంకర్‌రెడ్డి,బిజెవైఎం, మండల అధ్యక్షులు రాజేష్, కిసాన్ మోర్చామండలఅధ్యక్షులుఎల్లారెడ్డి, బూత్‌అధ్యక్షులు నవీన్, మహేష్,రామిరెడ్డి,అనిల్,రాజేందర్ పాల్గొన్నారు.



ఎర్రవల్లి చౌరస్తాలో ఎమ్మెల్సీగా బిజెపి అభ్యర్థి ఏవిఎన్‌రెడ్డి గెలుపొందడంతో సంబరాలు చేసుకుంటున్న బిజెపి నాయకులు

# రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అంబర్ టౌన్‌షిప్ ప్లాట్లు ప్రజలకు అనుకూలంగా ఉంటాయి

- గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి
- బహిరంగ వేలం ప్రక్రియకు హాజరైన జిల్లా కలెక్టర్

**గద్వాల ప్రతినిధి,మార్చి 17 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అంబర్ టౌన్‌షిప్ ఫ్లాట్‌లు అనుకూలంగా ఉంటాయని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. శుక్రవారం గద్వాల పట్టణంలోని హరిత హోటల్‌హాలులో మిగిలిపోయిన 54 రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అంబర్ టౌన్‌షిప్ ప్లాట్ల బహిరంగ వేలం ప్రక్రియకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగవేలం 54 ఫ్లాట్‌లకు సంబంధించి వేలంను నిర్వహించగా ఉదయం 10 గం.ల నుండి సాయంత్రం 5 గం.ల వరకు 54 ఫ్లాట్‌లు వేలంలో సొంతం చేసుకున్న వారికి కలెక్టర్ చేతుల మీదుగా ఆర్డర్ కాపీ ఇవ్వడం జరిగింది.కార్యక్రమంలో డిపిఓ శ్యాంసుందర్, సూపరింటెండెంట్ రాజు,గద్వాల తహసిల్దార్‌వెంకటేశ్వర్లు,సంబంధితఅధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.





వేలం పాటలో పాల్గొన్న దరఖాస్తుదారులు, ఫ్లాట్లు సొంతం చేసుకున్న వారికి ఆర్డర్ కాపీ ఇస్తున్న కలెక్టర్

# వివాహ వేడుకల్లో పాల్గొన్న చింతలపల్లి జగదీశ్వర్ రావు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న చింతలపల్లి జగదీశ్వర్ రావు

**వీపనగండ్ల,మార్చి 17 ప్రభాతవార్త:** చిన్నంబావి మండలం పెద్దదగడ గ్రామంలో బీఆర్ఎస్ వీపనగండ్ల మండల రైతు బంధు సమితి అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య ఆహ్వానం మేరకు ఎత్తం కృష్ణయ్య అల్లుడు రాజు యాదవ్, విజయలక్ష్మి ల వివాహ వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించారు.

# రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న జడ్పీటీసీ

**అడ్డాకుల,మార్చి 17 ప్రభాతవార్త:** అడ్డాకుల మండలం పెద్దమునగాలచేడు గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో శుక్రవారం మండల జడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆయన తో పాటు ఎంపీటీసీ చంద్రయ్య సాగర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రమోహన్ రెడ్డి,డాక్టర్ల బృందం,ఆశవర్కర్లు,అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అరెస్టు అనైతికం భేషరతుగా విడుదల చేయాలి



బీఎస్పీ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆంజనేయులు

**మక్తల్,మార్చి 17 ప్రభాతవార్త :** బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిరాహార దీక్షకు పూనుకుంటే తెరాస ప్రభుత్వం పోలీసులచే అరెస్టు చేయించడం దుర్మార్గమైన చర్యని శుక్రవారం నారాయణపేట బిఎస్పీ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగాల పారదర్శకత విషయంలోరాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నది. టిఆర్‌ఎస్‌పిఎస్‌సి నిర్వహించే పరీక్షల పేపర్ లీకేజీ విషయంలో ఛైర్మన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు నిరుద్యోగుల పక్షాన బీఎస్పీ అండగా నిలబడుతుందని అక్రమ అరెస్టులతో ఈ పోరాటాన్ని ఆపలేరని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఎన్నికల దృష్ట్యా చెక్‌పోస్టులను పటిష్టం చేయాలి

(మొదటి పేజీ తరువాయి భాగం)

ఇసుక మాఫియా, చైన్ స్నాచింగ్ గ్యాంగ్‌లను అరికట్టడంపై చర్చించారు. ఇంటర్ బోర్డు చెక్ పోస్టులను పకడ్బందీగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించారు. కర్ణాటకలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సందర్భంగా నారాయణపేట జిల్లాలో బంగారం, చీరలు కర్ణాటకకు అధికమొత్తంలో రవాణా చేసినట్లు గుర్తిస్తే తమకు తెలపాలని యాద్గిర్ జిల్లాకలెక్టర్ కోరారు.నారాయణపేట జిల్లాకు క్రిష్ణ, జలాల్‌పూర్, కాన్‌కుర్తి, ఎక్లాస్‌పూర్ బోర్డర్ చెక్‌పోస్టులు ఏర్పాటుపై జిల్లా పోలీస్ అధికారులు చర్చించారు. ఇరు జిల్లా అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి అక్రమ రవాణా నియంత్రణ కొరకు మరింత పటిష్టచర్యలు తీసుకోవాలని అవగాహనకు వచ్చారు. అదేవిధంగా ఇంటర్ స్టేట్ బోర్డర్ అధికారులు సంయుక్తంగా వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసుకుని సమాచార మార్పిడి ఎప్పటికప్పుడు ఇచ్చిపుచ్చుకోవాలని తెలిపారు. జిల్లాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్న వాట్సాప్‌లో సమాచారం ఇవ్వాలని అధికారులకు తెలిపారు. జిల్లానుండి ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



విడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీ

# పప్పు ధాన్యాల పంటలకు ఎండాకాలం అనుకూలం

**లింగాల,మార్చి 17 ప్రభాతవార్త:** పప్పుధాన్యాల పంటలకు ఎండాకాలం అనుకూలంగా ఉంటుందని, రైతులు పప్పుధాన్యాల పంటలను సాగుచేసి అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయ అధికారి నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అంబట్‌పల్లి గ్రామంలోని రైతు వేదికలో రైతులకు జాతీయ ఆహార భద్రత పథకం 2022, 23 లో భాగంగా పప్పు ధాన్యల పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ఎండాకాలంలో సాగుచేసే రైతులకు 100శాతం రాయితీలో మినుములు విత్తనములు విబిఎన్ 8 రకం విత్తనశుద్ధికి రైబోబియం మందు అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి రైతువేదిక వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలోని 45మంది రైతులకు మినుము పంట విబిఎన్ 8 రకం సాగును ప్రోత్సహించడం కోసం విత్తనములు అందజేస్తున్నట్లు తెలిపారు. పప్పుధాన్యల పంటల కాల పరిమితి 65 నుంచి 70 రోజులు కోతకు వస్తుందని, దిగుబడి ఎకరాకు 3 నుండి 5 క్వింటాలు వస్తుందన్నారు. విత్తనాలు వచ్చే వానాకాలం యాసంగి పంటకు ఉపయోగించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవిశంకర్, సింగిల విండో మాజీఛైర్మన్ జంబుల వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ జనార్ధన్, వ్యవసాయ విస్తరణ అధికారి శివానంద్, రైతులు పాల్గొన్నారు.



పప్పుధాన్యల పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి నాగార్జునరెడ్డి

# పిల్లల విద్యాపరమైన ఎదుగుదలకు తల్లిదండ్రుల పాత్ర కీలకమైనది

**నారాయణపేట ప్రతినిధి,మార్చి17 ప్రభాతవార్త :** మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్యాలలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కలెక్టర్ సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ ఆదేశాల మేరకు మార్చి 2023కు గాను, తరగతుల వారిగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పిటిఎం) నేడు ఉదయం 7.30 గం.లనుండి, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. పిల్లల విద్యాపరమైన ఎదుగుదలకు తల్లిదండ్రుల పాత్ర కీలకమైనదిగా ఉండేలా, 100 శాతం తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి పిటిఎం కోసం వారిని ఆహ్వానించడానికి, హెచ్ఎంలు ముందుగానే పాఠశాల విద్యార్థుల ద్వారా వ్రాతపూర్వకంగా ఆహ్వానం పంపడం ద్వారా తల్లిదండ్రులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. పిటిఎంల కోసం ఇప్పటివరకు రాని తల్లిదండ్రులపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టిపెట్టి,వారు కూడా వచ్చే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతంలోని చాలా మంది తల్లిదండ్రులు వ్యవసాయ పనుల్లో,పట్టణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు ఇతర పనుల్లో నిమగ్నమై ఉన్నందున వారు సమావేశానికి హాజరయ్యేందుకు వీలుగా పిటిఎంను ఉదయం 7.30 ని.లకు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడిలేని వాతవరణంలో పరీక్షలకు సిద్ధం కావడానికి, పిటిఎం సమాయంలో తల్లిదండ్రులు వారి పిలలలకు మార్గనిర్దేశం చేయవచ్చన్నారు. అన్ని ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక పిటిఎంను నిర్వహించాలన్నారు. పిటిఎం సమావేశ మినిట్స్‌ను ప్రధానోపాధ్యాయులు తప్పక రికార్డు చేయాలన్నారు. జిల్లాలోని వివిద విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మార్చి 2023 నెలలో తరగతుల వారిగా తల్లిదండ్రుల ఉపాధ్యాయ సమావేశాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకునే విధంగా ప్రభుత్వ స్థానిక సంస్థల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలుఅందించాల్సిందిగా తెలియజేశారు. అదేవిధంగా నేడు నిర్వహించే బాలసభలను పంచాయతీ సిబ్బంది డాక్యుమెంటేషన్ చేయనున్న సందర్భంగా విద్యార్థుల ప్రగతిని చక్కని ప్రదర్శన చేయాలన్నారు.



నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష